బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 11 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4

## పరిశీలనలో బీసీ రిజర్వేషన్ పెంపు బిల్లులు

- లోక్‌సభలో ఈటల ప్రశ్నకు కేంద్ర మంత్రి బీఎల్ వర్మ సమాధానం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే అంశానికి సంబంధించిన బిల్లులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో స్పష్టం చేసింది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ లోక్‌సభలో ప్రశ్నించగా, కేంద్ర సామాజిక న్యాయం శాఖ మంత్రి బీఎల్ వర్మ సమాధానమిచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి బీఎల్ వర్మ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన రెండు బిల్లులు తెలంగాణ శాసనసభ కార్యదర్శి ద్వారా రాష్ట్రపతి ఆమోదం కోసం కేంద్రానికి వచ్చాయని తెలిపారు. ఆ బిల్లులు ప్రస్తుతం పరిశీలన దశలో ఉన్నాయని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ఆమోదం పొందిన రెండు బీసీ రిజర్వేషన్ బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయం తెలిసిందే. ఈ బిల్లులపై రాష్ట్రపతి ఆమోదం లభిస్తే, రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతానికి పెరగనున్నాయి. ప్రస్తుతం ఈ అంశంపై కేంద్ర స్థాయిలో ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

# నేడే మున్సిపల్ ఎన్నికల పోలింగ్



- 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్
- 2,983 స్థానాల్లో 12,652 మంది పోటీ
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్
- పోలింగ్ కేంద్రాల వద్ద ఆంక్షలు
- విద్యాసంస్థలకు సెలవు.. ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు
- 8,203 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ భద్రత : డీజీపీ శివధర్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 11 (బుధవారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఓటింగ్ నిర్వహణ కోసం 8,203 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. మొత్తం 2,982 వార్డుల్లో 12,930 మంది అభ్యర్థుల భవితవ్యం మరికొద్ది గంటల్లో తేలనుంది.

ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 22,519 మంది అభ్యర్థులు 29,742 నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం 12,944 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో 9 మున్సిపాల్టీలు, 2 కార్పొరేషన్లలో 14 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో 12 మంది కాంగ్రెస్‌కు, 2 మంది బీఆర్ఎస్‌కు చెందినవారు కావడం గమనార్హం.

**పోలింగ్ ఏర్పాట్లు**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం
16,031 బ్యాలెట్ బాక్సులు,
137 స్ట్రాంగ్ రూములు,
136 ఓట్ల లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేసింది.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఎన్నికలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

**8,203 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ భద్రత : డీజీపీ శివధర్ రెడ్డి**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు బుధవారం పోలింగ్ జరగనుంది.

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,203 పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. వీటిలో 1,302 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకంగా, 1,926 కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి, అక్కడ అదనపు పోలీస్ బలగాలను మోహరించినట్లు చెప్పారు.

**100 శాతం వెబ్‌కాస్టింగ్**

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రం వెలుపల కూడా సీసీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సుమారు 3 వేల మంది అదనపు బలగాలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. ఇందులో టీజీఎస్పీతో పాటు అటవీ, ఎక్సైజ్, సీఐడీ, లీగల్ మెట్రాలజీ విభాగాల సిబ్బంది కూడా ఉన్నారని తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల ప్రచారం ముగియడంతో సైలెంట్ పీరియడ్ అమల్లోకి వచ్చిందని, ఈ సమయంలో విజిబుల్ పోలీసింగ్‌ను పెంచి గస్తీని ముమ్మరం చేశామని డీజీపీ చెప్పారు.

**రూ.3.09 కోట్ల స్వాధీనం**

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన గత నెల 27 నుంచి ఇప్పటివరకు పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టి రూ.3.09 కోట్ల విలువైన నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ వెల్లడించారు.వీటిలో: రూ.1.29 కోట్ల నగదు రూ.1.21 కోట్ల విలువైన మద్యం రూ.15.7 లక్షల విలువైన మాదకద్రవ్యాలు రూ.28.69 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయి.

అక్రమ రవాణాను అరికట్టేందుకు పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు, జిల్లాల సరిహద్దుల్లో 55 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

మిగితా 2వ పేజీలో

## బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

- రాజకీయ వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు
- మక్తల్‌లో ఉద్రిక్తత.. డీజీపీ కార్యాలయం వద్ద బీజేపీ ఆందోళన
- మక్తల్ మున్సిపల్ 6వ వార్డు ఎన్నిక వాయిదా..!




**బలగం టీవీ, మక్తల్**

నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ ఆరో వార్డు నుంచి బీజేపీ తరపున పోటీ చేస్తున్న ఎరుకలి మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎన్నికల బరిలో ఉన్న

మిగితా 2వ పేజీలో

## లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం



- చర్చ పూర్తయ్యే వరకు సభకు దూరంగా స్పీకర్

**బలగం టీవీ, న్యూఢిల్లీ:**

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేశాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా విపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష ఎంపీలకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అదేవిధంగా ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ, చీఫ్ విప్ కే. సురేశ్ లోక్‌సభ సెక్రటేరియేట్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేశారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే పార్టీల తరపున ఈ నోటీసు సమర్పించారు. అయితే ఈ అవిశ్వాస తీర్మానానికి తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు మద్దతు ఇవ్వలేదు. ఈ చర్యలో తాము భాగస్వాములు కాదని టీఎంసీ స్పష్టం చేసింది.

**స్పీకర్ కీలక నిర్ణయం**

విపక్షాలు తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యే వరకు సభకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. స్పీకర్‌ను పదవి నుంచి తొలగించేందుకు కాంగ్రెస్ లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసు ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.ఫిబ్రవరి 2 నుంచి రాహుల్ గాంధీ ప్రసంగాన్ని ప్రభుత్వం అడ్డుకుంటోందని కాంగ్రెస్ ఆరోపించింది. దీంతో అప్పటి నుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదని పేర్కొంది. అంతేకాకుండా కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోలేదని, ఇది స్పీకర్ పక్షపాత ధోరణికి నిదర్శనమని కాంగ్రెస్ అసంతృప్తి వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో సోమవారం జరిగిన విపక్షాల సమావేశంలో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## "రెండేళ్లుగా మాటలే.. పనులు లేవు"

- మా తల్లి పెట్టిన పేరు మార్చే రేవంత్‌రెడ్డికి ఎవరిచ్చారు
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం
- బీజేపీ అభ్యర్థి మృతికి సీఎందే బాధ్యత
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**బలగం టీవీ, న్యూఢిల్లీ:**

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతోనే కాలయాపన చేస్తున్నారని, చేతల్లో చూపించే సమయం వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసే శక్తి లేకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. తన పేరును మార్చి పిలవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు మీ పేరు రేవంత్ ఖాన్‌గా మార్చుకుంటే మాకు అభ్యంతరం లేదు. కానీ మా తల్లి పెట్టిన పేరును మార్చే హక్కు మీకెవరు ఇచ్చారు? వ్యక్తిగత విమర్శలు సరికాదు" అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మజ్లిస్‌తో మీరు కాపురం చేసినన్నాళ్లు తాము నిప్పులు పోస్తూనే ఉంటామని వ్యాఖ్యానిస్తూ.. సీఎం వ్యాఖ్యలను ఖండించారు. తనను ఎవరి దత్తపుత్రుడిగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.తెలంగాణలో అన్ని స్థానాల్లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయలేదని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏవైనా విభేదాలుంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలో లాగడం సరికాదన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించారు.

కేసీఆర్‌ను అరెస్ట్ చేయకుండా తన పేరు మార్చుతానని సీఎం అంటున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుండా చూసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఒక్కరోజు కూడా కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని విమర్శించారు. తాము ఎప్పుడూ బీఆర్ఎస్‌తో కలవలేదని తేల్చిచెప్పారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనపై ఎన్నికల సంఘం నిష్పక్షపాత విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫోన్ ట్యాపింగ్ ఇంకా జరుగుతోందని అనుమానం

- పురపోరులో ఎగిరేది కాంగ్రెస్ జెండానే
- 80 శాతం పైగా స్థానాల్లో ఘన విజయం ఖాయం
- సీఎం రేసులో నేను లేను
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండానే ఎగరబోతోందని, రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో 80 శాతం పైగా స్థానాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించబోతోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత రెండేళ్లలో జరిగిన అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను ప్రజలు తిప్పికొట్టారని పేర్కొన్నారు.ఒకప్పుడు ఎన్నికలను రిఫరెండం, సెమీఫైనల్స్ అంటూ ప్రచారం చేసిన ప్రతిపక్ష నేతలు ఇప్పుడు మౌనంగా మారారని విమర్శించారు. ఓటమి భయంతోనే వారు ప్రచారానికి దూరంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తున్నందున, ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులకే పట్టం కడుతున్నారని అన్నారు.

**ఫోన్ ట్యాపింగ్‌పై అనుమానాలు**

ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందన్న అనుమానం ఉందని మంత్రి తెలిపారు. గతంలో పెద్దల నుంచి సామాన్యుల వరకు ఎవ్వరినీ వదలకుండా ఫోన్ ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలు నిజమేనని సంకేతాలు ఉన్నాయని పేర్కొన్నారు. అధికారులతో కాన్ఫరెన్స్ కాల్స్‌లో మాట్లాడిన అంశాలు బయటకు రావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా విచారణ జరుపుతోందని, ఎక్కడెక్కడ పరికరాలు అమర్చారు, సూత్రధారులెవరు అన్నది బయటకు తీస్తామని స్పష్టం చేశారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు.

**సీఎం రేసులో లేను**

తాను సీఎం రేసులో లేనని, కాంగ్రెస్ పార్టీలో ఒక సాధారణ కార్యకర్తనేనని మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు చెప్పానని, మళ్లీ స్పష్టంగా చెబుతున్నానని తెలిపారు.

మిగితా 2వ పేజీలో

## టెట్ ఫలితాలు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ టెట్ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ అధికారులు మంగళవారం అధికారికంగా విడుదల చేశారు. జనవరిలో నిర్వహించిన టెట్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే ప్రకటించడం విశేషం. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల హడావిడి కొనసాగుతున్నప్పటికీ, ఫలితాల విడుదలలో ఎలాంటి జాప్యం జరగలేదు. టెట్ పరీక్ష రాసిన అభ్యర్థులు తమ ఫలితాలను https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని అధికారులు తెలిపారు. హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.


**జీవితకాలం చెల్లుబాటు అయ్యే సర్టిఫికెట్**

టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు జారీ చేసే సర్టిఫికెట్ జీవితకాలం చెల్లుబాటు అవుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. డీఎస్సీ (ఖాజ) ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే టెట్ అర్హత తప్పనిసరి కావడంతో, లక్షలాది మంది అభ్యర్థులు ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూశారు. ఫలితాల విడుదలతో నెలకొన్న గందరగోళానికి తెరపడింది.ఈ ఏడాది జనవరి 3 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో టెట్ పరీక్షలను నిర్వహించారు.

మిగితా 2వ పేజీలో

## కృష్ణా నీళ్లలో 80 శాతం ఏపీయే వాడుకుంది

- సీఎం, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నరు..?
- తెలంగాణ ప్రయోజనాలు గాలికేనా
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఏపీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా కృష్ణా నదీ జలాలను తరలించుకుపోతుంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీళ్ల మంత్రి చేతులు ముడుచుకుని కూర్చున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. పూర్తి ఆధారాలతోనే తాను మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు.తెలంగాణ ఇరిగేషన్ శాఖ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కి రాసిన లేఖ ప్రకారం ఈ వాటర్ ఇయర్‌లో ఏపీ ఇప్పటికే 664 టీఎంసీల నీటిని వినియోగించుకుందని తెలిపారు. ఇది మొత్తం కృష్ణా జలాల్లో 80 శాతానికి సమానమని పేర్కొన్నారు. తాత్కాలిక ఒప్పందం (66:34) ప్రకారం ఏపీకి కేవలం 66 శాతం మాత్రమే హక్కు ఉన్నప్పటికీ, ఆ పరిమితిని దాటిందని ఆరోపించారు.

**ఈఎన్సీ పోస్టు ఖాళీ ఎందుకు..?**

జనవరి 28న ఏపీ నీటి వినియోగం వాటా దాటుతోందని కేఆర్ఎంబీకి తెలంగాణ ఈఎన్సీ లేఖ రాశారని, వెంటనే బోర్డు సమావేశం ఏర్పాటు చేసి నీటి దోపిడీని ఆపాలని కోరినట్టు హరీష్ రావు వెల్లడించారు. అయితే, జనవరి 31న ఈఎన్సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల పాటు ఆ కీలక పోస్టును ఖాళీగా ఉంచారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్న సమయంలో ఇరిగేషన్ శాఖలో కీలక పోస్టును ఖాళీగా ఉంచడం వెనుక కారణం ఏంటని ప్రశ్నించారు.తాత్కాలిక ఒప్పందం ప్రకారం తెలంగాణకు 34 శాతం వాటా ఉందని, అంటే 174 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం 20 శాతమే వాడుకున్నామని తెలిపారు. ఈ రోజుకూ ఏపీ రోజుకు 1.5 టీఎంసీల నీటిని తరలించుకుపోతుందన్నారు. వేసవి సమీపిస్తున్న వేళ మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటలు, తాగునీటి అవసరాల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కృష్ణా జలాల వినియోగం అత్యల్ప స్థాయిలో ఉందని హరీష్ రావు అన్నారు. వరుసగా రెండేళ్లుగా అతి తక్కువ నీటిని వాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నట్టుగా ఉందని ఆరోపించారు. హక్కులు కాపాడాల్సిన ముఖ్యమంత్రి రాష్ట్రానికి శాపంగా మారారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ ఈఎన్సీ లేఖలో ఏపీ 664 టీఎంసీలు వాడిందని పేర్కొంటే, కేఆర్ఎంబీ మాత్రం 555 టీఎంసీలుగా చెప్పడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ ఆధీనంలో ఉన్న కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప తెలంగాణ నీటి హక్కులపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు.

**బీజేపీ--కాంగ్రెస్ కుమ్మక్కు**

ఏపీకి నీళ్ల తరలింపులో బీజేపీ, కాంగ్రెస్ మధ్య కుమ్మక్కు ఉందని హరీష్ రావు ఆరోపించారు. స్కాంలు బయటపడతాయనే భయంతో రెండు పార్టీలు మౌనంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర హక్కులు దెబ్బతింటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. త్వరలో కేఆర్ఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, కేంద్ర మంత్రులను కలుస్తామని, పార్లమెంట్‌లో ఈ అంశాన్ని గట్టిగా లేవనెత్తుతామని ప్రకటించారు. తెలంగాణ నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హరీష్ రావు తేల్చిచెప్పారు.

## కాంగ్రెస్‌పై ఎస్ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు



- ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వినతిపత్రం సమర్పణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఉల్లంఘిస్తోందని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర ఆరోపణలు చేసింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కురువ విజయ్ కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి, కాంగ్రెస్ పార్టీ అక్రమాలపై సమగ్రమైన ఫిర్యాదు పత్రాన్ని సమర్పించింది.

**నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే ప్రచారం**

ఫిర్యాదులో భాగంగా గద్వాల సిట్టింగ్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి 48 గంటల నిశ్శబ్ద కాలాన్ని బేఖాతరు చేస్తూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. గద్వాల పట్టణంలోని 17వ వార్డు, భీమ్‌నగర్, బాలాజీ అపార్ట్‌మెంట్లలో ఓటర్లతో సమావేశాలు నిర్వహించారని, ఇది ఎన్నికల చట్టాలకు విరుద్ధమని వివరించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేను తక్షణమే ఎన్నికల ప్రక్రియ నుంచి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**ఖమ్మంలో అధికార దుర్వినియోగం**

ఖమ్మం జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఒక మంత్రి గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, ట్రెజరీ అధికారులు, టీఎన్‌జీఓ నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇది ప్రభుత్వ యంత్రాంగాన్ని బహిరంగంగా దుర్వినియోగం చేసిన ఘటనగా బీఆర్ఎస్ అభివర్ణించింది.

**మహబూబ్‌నగర్‌లో పోలీసుల పక్షపాత ధోరణి**

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. వన్‌టౌన్, రూరల్ సీఐలు కాంగ్రెస్ నేతలు పంచుతున్న మద్యం, డబ్బుకు రక్షణ కల్పిస్తూ, బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ నేతలు పోలీసుల అండతో ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, దీనివల్ల స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగడం లేదని కమిషన్‌కు బీఆర్ఎస్ వివరించింది.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరింది . 'నిబంధనలు ఉల్లంఘించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పక్షపాతంగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులను వెంటనే బదిలీ చేయాలి. వీడియో ఫుటేజీల ఆధారంగా అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఓటర్లు భయం లేకుండా ఓటు వేసేలా తటస్థ వాతావరణాన్ని కల్పించాలి' అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బొమ్మెర రామ్మూర్తి, సురివి యాదయ్య గౌడ్, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రూ.1,511 కోట్ల భూమి రక్షణ

### నాలుగు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులను కాపాడిన హైడ్రా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నగరంలో అక్రమ ఆక్రమణలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. హైదరాబాద్‌లోని నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో రూ.1,511 కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కు స్థలాలను ఆక్రమణల చెర నుంచి హైడ్రా విముక్తం చేసింది. ఆక్రమిత భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూములని సూచించే బోర్డులు ఏర్పాటు చేసింది. పార్కులు, చెరువుల ఆక్రమణలను సీరియస్‌గా పరిగణిస్తున్న హైడ్రా, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది.

మిగితా 2వ పేజీలో

## జగ్గారెడ్డిపై కేసు నమోదు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పురపాలక సంఘ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కేసులో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిపై సంగారెడ్డి జిల్లా సదాశివపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. మంగళవారం ఉదయం సమయంలో సదాశివపేట మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు పట్టణంలోని బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న చాన్‌భాయ్ చాయ్ హోటల్ వద్ద జగ్గారెడ్డి కొంతమందితో కలిసి డబ్బులు పంపిణీ చేస్తున్నారన్న సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ వెంటనే అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టింది. తనిఖీల సమయంలో అక్కడ జగ్గారెడ్డి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే, ఆయన ఎవరికి డబ్బులు పంపిణీ చేయలేదని ప్రాథమిక విచారణలో తేలినట్టు అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ, ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు సంబంధిత ఎన్నికల ప్రాంతానికి చెందని రాజకీయ నాయకులు ఆ ప్రాంతంలో ఉండకూడదనే నిబంధనను జగ్గారెడ్డి ఉల్లంఘించినట్టు అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి జగ్గారెడ్డిపై సదాశివపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సదాశివపేట సీఐ డి. వెంకటేష్ విలేకరుల సమావేశంలో తెలిపారు.

## కొనసాగుతున్న మేడారం హుండీ లెక్కింపు

- రూ.12.64 కోట్ల ఆదాయం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మేడారం జాతర హుండీ లెక్కింపులలో భాగంగా మంగళవారం నాటికి ఆదాయం రూ.12.64 కోట్లకు చేరుకుంది. జాతరలో మొత్తం 828 హుండీలను ఏర్పాటు చేశారు. మంగళవారంనాడు లెక్కింపులో రూ.80,81,935 ఆదాయం వచ్చినట్టు అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు రోజుల్లో ఆదాయం రూ.12.64 కోట్లకు చేరుకుంది. ఈనెల 5వ తేదీన 125 హుండీలలోని కానుకలను లెక్కించగా రూ.2,49,65,000, 6వ తేదీన 160 హుండీలలోని కానుకలను లెక్కించగా రూ.3,54,25,200 (విదేశీ కరెన్సీ మార్పిడి రూ.63,436), 7వ తేదీన 140 హుండీలలోని కానుకలను లెక్కించారు. ఇందులో రూ.2,01,21,440 (విదేశీ కరెన్సీ మార్పిడి రూ.71,283), 8వ తేదీన 200 హుండీలను లెక్కించగా, ఇందులో రూ.2,64,75,757 ఆదాయం వచ్చింది. 9వ తేదీన163 హుండీలలోని కానుకలను లెక్కించగా రూ.1,12,63,000, 10వ తేదీన 40 హుండీలను లెక్కించగా రూ.80,81,935 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. పర్యవేక్షణాధికారుల సమక్షంలో ఈ ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. బంగారం, వెండి కానుకలను వేర్వేరుగా ఇనుప హుండీలలో భద్రపరచి వుంచగా, వాటి విలువ నిర్ధారణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు చెప్పారు. నాణెల లెక్కింపు, ఇ-హుండీ లెక్కింపులు ప్రారంభించలేదని పేర్కొన్నారు.



## ముఖ్యమంత్రికి కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానం..

బలగం టీవీ, హైదరాబాద్

కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న "కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు--2026" కు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్ ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి కి ఆశీర్వచనలు అందించారు.

## తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

- **దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం: మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు**

బలగం టీవీ, హైదరాబాద్



తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వివక్ష చూపుతోందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ ఆదాయానికి దక్షిణాది రాష్ట్రాలే వెన్నెముకగా నిలుస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. 2018 నుంచి 2023 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం పన్నుల రూపంలో రూ.90.80 లక్షల కోట్ల ఆదాయం సమీకరించిందని తెలిపారు. అయితే అందులో దక్షిణాది రాష్ట్రాలకు కేవలం రూ.22.86 లక్షల కోట్లు మాత్రమే కేటాయించిందని పేర్కొన్నారు. ఇది తీవ్రమైన అన్యాయమని మండిపడ్డారు.

దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి కేవలం 30 పైసలే ఇచ్చే కేంద్ర ప్రభుత్వం, బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలకు మాత్రం రూపాయికి రూ.4 చొప్పున నిధులు కేటాయిస్తోందని విమర్శించారు. ఇలాంటి విధానాలు రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించడం కాదా..? అని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సమానత్వం, న్యాయసూత్రాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, దక్షిణాది రాష్ట్రాల పట్ల చూపుతున్న ఈ వివక్షను తక్షణమే సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

## బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

మహదేవప్ప శనివారం తెల్లవారుజామున తన నివాసంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.ప్రత్యర్థుల నుంచి ఎదురవుతున్న తీవ్రమైన రాజకీయ ఒత్తిళ్లు, వేధింపులే ఈ ఆత్మహత్యకు కారణమని కుటుంబ సభ్యులు, బీజేపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటన మక్తల్ పట్టణంలో తీవ్ర కలకలం రేపింది.

**డీజీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత**

మహదేవప్ప ఆత్మహత్య ఘటనపై నిరసనగా బీజేపీ శ్రేణులు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపిస్తూ డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని పలువురు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

**డీజీపీ స్పందన**

ఈ ఘటనపై డీజీపీ స్పందిస్తూ.. మహదేవప్ప వద్ద ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఘటనకు సంబంధించి ఎవరిపై అయినా ఆరోపణలు నిరూపితమైతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**బీజేపీ నేతల ఆరోపణలు**

ఈ ఘటన తీవ్రంగా కలచివేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అహంకారపూరిత రాజకీయాలు, బెదిరింపులే మహదేవప్ప ఆత్మహత్యకు కారణమని ఆరోపించారు. మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపులు తట్టుకోలేకే మహదేవప్ప ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడని ఆరోపించారు. అధికార మత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని మండిపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన మంత్రి శ్రీహరిని తక్షణమే అరెస్ట్ చేయాలని, మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యపై ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ జరపాలని, లేనిపక్షంలో బీజేపీ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మహదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## టెట్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 2,37,754 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 1,95,181 మంది పరీక్షకు హాజరయ్యారు. హాజరు శాతం 82.09గా నమోదైంది. దాదాపు 42 వేల మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ఈసారి టెట్‌కు ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావడం గమనార్హం. వారి హాజరు శాతం 90కి పైగా నమోదైంది. జనవరి 30న ప్రాథమిక కీ విడుదల చేసి, ఫిబ్రవరి 1 వరకు అభ్యంతరాలను స్వీకరించారు. నిపుణుల కమిటీ సూచనల మేరకు ఫైనల్ కీని రూపొందించి, దాని ఆధారంగానే ఫలితాలను ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.

## ఎన్నికలకు 800 పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు..

- **పోలింగ్ పూర్తి అయ్యేవరకు అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**
- **స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి.**
- **ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 BNSS (144 సెక్షన్ అమలు)**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్ల,వేములవాడ మున్సిపల్ పరిధిలో జరుగు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునెల,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 800 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సిరిసిల్ల,వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ అధికారులకు , సిబ్బందికి ఎన్నికల విధులపై జిల్లా ఎస్పీ దిశ నిర్దేశం చేశారు.

ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో రూట్ మొబైల్స్: 17 జోనల్ టీమ్స్ : 06 (ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో), రిసర్వ్ టీమ్స్ : 04 ,స్ట్రయి కింగ్ ఫోర్స్ : 02 , స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్స్ : 02 , ఏర్పాటు చేసి మొత్తం 800 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లరాదని,రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని,పోలింగ్ కేంద్రాల వద్ద,రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు తీసుకువెళ్లడం నిషేధమని, పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై పూర్తిగా నిషేధం ఉంటుందని తెలిపారు. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 దీఎూా (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన తీసుకుంటాని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరికీ బాధ్యత అన్నారు.

ఎస్పీ వెంట వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచాలరి, ఇన్స్పెక్టర్ లు, ఆర్.ఐ లు,ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నేడే మున్సిపల్ ఎన్నికల పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

**ప్రత్యేక తనిఖీలు, ముందస్తు చర్యలు**

మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందుకోసం 181 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 167 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ పనిచేస్తున్నాయని వెల్లడించారు.ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 1,183 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేయించామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 4,318 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. వివిధ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న 398 నాన్ బెయిలబుల్ వారెంట్లు అమలు చేశామని, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై 142 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు.

**ఓటర్లకు డీజీపీ విజ్ఞప్తి**

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, భయం లేకుండా తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ఫోన్ ట్యాపింగ్ ఇంకా జరుగుతోందని అనుమానం

(మొదటి పేజీ తరువాయి)

**జిల్లాల విభజనపై కమిటీ**

జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదని ఆయా జిల్లాల ప్రజల నుంచి అనేక విజ్ఞప్తులు వచ్చాయని మంత్రి వెల్లడించారు. ఈ అంశంపై ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసి, నివేదికపై అసెంబ్లీలో చర్చ చేపడుతామని తెలిపారు. ఈ చర్చకు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా హాజరుకావాలని సూచించారు.

**అర్బన్ ప్రాంతాల్లోనూ కాంగ్రెస్**

కాంగ్రెస్ గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే ఉందని, పట్టణాల్లో లేదన్నది ప్రతిపక్షాల భ్రమేనని మంత్రి వ్యాఖ్యానిం చారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత వారికి వాస్తవం తెలుస్తుందన్నారు. గత ఉప ఎన్నికలు, పంచాయితీ ఎన్నికల్లో మాదిరిగానే మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కే ప్రజలు పట్టం కడతారన్న పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు రూపంలో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

## హైదరాబాద్‌లో రూ.1,511 కోట్ల భూమి రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

**కొండాపూర్‌లో రూ.700 కోట్ల చెరువు భూమి రక్షణ**

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం -- మదీనాగూడ రోడ్డు మార్గంలో ఉన్న కొండాపూర్ ప్రాంతంలో రూ.700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జంగం కుంట చెరువును పూడ్చి, మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న కబ్జాదారుల ఆటను అడ్డుకుంది. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా సంయుక్త తనిఖీలు చేపట్టింది. ఈ స్థలం జంగం కుంట చెరువేనని నిర్ధారించిన అధికారులు, ఆక్రమణదారులపై కేసులు నమోదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

**అల్వాల్ కొత్త చెరువులో ఆక్రమణల తొలగింపు**

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువులో ఎనిమిది ఎకరాల మేర జరిగిన ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు చేపట్టి చెరువును కలుషితం చేస్తున్నారని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తాత్కాలిక షెడ్డులు ఏర్పాటు చేసి వ్యర్థాలను చెరువులోకి వదులుతున్నట్లు గుర్తించిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను నిర్ధారించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన షెడ్డులు, నాలుగు షట్టర్లను తొలగించారు.

**1,100 గజాల పార్క్ స్థలాల పరిరక్షణ**

వనస్థలిపురం సాహెబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడినగర్ కాలనీలో 650 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబర్లు 132, 133లో 1982లో వేసిన లేఅవుట్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాట్లుగా విక్రయించినట్లు ఫిర్యాదులు రావడంతో హైడ్రా పరిశీలన చేపట్టింది. అక్రమంగా నిర్మించిన ప్రహరీ, షెడ్డులను తొలగించి పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

అలాగే మల్కాజిగిరి జోన్ మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్, రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో ఉన్న 450 గజాల పార్కు స్థలాన్ని కూడా హైడ్రా రక్షించింది. జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ఈ స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ, రేకుల షెడ్డును తొలగించింది.

# స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి..

- అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



మున్సిపల్ ఎన్నికల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో బుధవారం పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో, వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిరిసిల్ల గీతానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని, పోలింగ్ అధికారులు బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను సరిచూసుకోవాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించామని అన్నారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని,పోలింగ్ కేంద్రం పరిధిలో 100 మీటర్ల వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, దివ్యాంగ ఓటర్లకు ర్యాంపులు, వీల్ చైర్ సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ అకౌంట్, పీఓ డైరీలను రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలని అన్నారు . ఈ నెల 13వ తేదీన సిరిసిల్ల, వేములవాడ సినారె కళామందిర్‌లో కౌంటింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39 వార్డులు, వేములవాడ మున్సిపల్ పరిధిలో 28 వార్డులు ఉండగా, సిరిసిల్లలో 117, వేములవాడలో 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39,942 మంది పురుషులు, 42,011 మంది మహిళా ఓటర్లు, 6 ఇతర ఓటర్లు కలిపి మొత్తం 81,959 మంది ఓటర్లు, వేములవాడ మున్సిపల్ పరిధిలో 19,580 మంది పురుషులు, 21,279 మంది మహిళా ఓటర్లు, 18 ఇతర ఓటర్లు కలిపి మొత్తం 40,877 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు.

రిజర్వ్ స్టాఫ్‌తో కలిపి సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 15 మంది, వేములవాడలో 12 మంది రిటర్నింగ్ అధికారులను, అలాగే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సిరిసిల్లలో 15 మంది, వేములవాడలో 12 మంది నియమించినట్లు తెలిపారు. సిరిసిల్లలో 140 మంది, వేములవాడలో 70 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించగా, రెండు మున్సిపాలిటీల్లో కలిపి ఏపీఓలు 210 మంది, ఓపీఓలు 630 మంది విధులు నిర్వహిస్తున్నారని అన్నారు.

**ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు..**

ఓటరు జాబితాలో పేరు ఉండి, ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) లేకపోయినా ఆధార్, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంక్ లేదా తపాలా పాస్‌బుక్ (ఫోటోతో), ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, పెన్షన్ పత్రాలు, ఉద్యోగ గుర్తింపు కార్డులు, యూడీఐడీ కార్డు వంటి ప్రత్యామ్నాయ ఫోటో గుర్తింపు పత్రాలలో ఏదో ఒకటి చూపి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు.

ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, అధికారులు జగన్ మోహన్ రెడ్డి, శ్రీనివాసాచారి, భారతి, అన్సార్, మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్న సిరిసిల్ల పట్టణ పోలీసులు.

- రూ13,200/- విలువ గల (12 లీటర్ల) మద్యం సీజ్, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు
- మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం, డబ్బు రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవు.
- సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని సిరిసిల్ల పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సుమారు 13,200 రూపాయల విలువైన 12 లీటర్ల విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ వెల్లడించారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభ పెట్టడానికి మద్యం ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళున్నట్లు సమాచారం మేరకు సిరిసిల్లలోని శాంతి నగర్ కి వెళ్ళగా నిందితుడు వేముల ప్రవీణ్ అనే వ్యక్తి ఈ రోజు 13,200/- రూపాయల విలువ గల క్ష్మశీఋశ్రీ జష్ఠుశ్రీశ్రీవఅస్త్రవ ఔష్ట్రఱంఎం 375 మీా (32) మద్యం సీసాలను తన సాంచాల షెడ్డులో నిల్వచేసినారని. ఈ మద్యం సీసాలు 2వ వార్డ్ నుండి బీఆర్?ఎస్? పార్టీ తరపున పోటి చేస్తున్న వేముల రాములు ఓటర్లకు పంచుట గురించి నిల్వ ఉంచినామని చెప్పగా పంచుల సమక్షంలో మద్యం సీసాలను, స్వాదినం చేసుకొని నిందితులు వేముల రాములు, వేముల ప్రవీణ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది అని తెలిపినారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# లింగన్నపేట అతిరుద్ర యాగంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటలో అతిరుద్ర మహా యాగం లో భాగంగా కాశీ విశ్వనాథ మందిర్ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ జోషి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించగా వేములవాడ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులతో లోక కళ్యాణం జరగాలని ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఎలాంటి ఆటంకాలు లేకుండా రాజన్న ఆలయ విస్తీర్ణ, అభివృద్ధి పనులు జరగాలని స్వామివారిని వేడుకున్నారు.

# వేములవాడ రాజన్న జాతరకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం.



**బలగం టీవీ, వేములవాడ:**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించనున్న జాతర మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ కార్యనిర్వాహక అధికారి రమాదేవి ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసి అధికారిక ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేములవాడ ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి కి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

# రాజన్న సిరిసిల్లలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..

- మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతిపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపల్ ఎన్నికల్లో 6వ వార్డు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎరుకల మహదేవప్ప మృతి చెందడం అత్యంత విషాదకరమని, దీనికి కాంగ్రెస్ మంత్రి వాకిటి శ్రీహరి వేధింపులే కారణమని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మండిపడ్డారు. మహదేవప్ప మృతికి నిరసనగా మంగళవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బిజెపి జిల్లా శాఖ అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ బీజేపీ శ్రేణులు దహనం చేయడం జరిగింది.

ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ మాఫియా రాజకీయాలు నిరంతరం బెదిరింపుల మధ్య 6వ వార్డు అభ్యర్థి బిజెపి ఎరుకల మహదేవప్ప అనువాదస్పదంగా మృతి చెందడం అత్యంత విషాదకరం గత కొంతకాలంగా స్థానిక మంత్రి వాకిటి శ్రీహరి నుంచి మహాదేవప్పపై తీవ్ర వేధింపులు జరుగుతున్నాయని కుటుంబ సభ్యులు స్థానికులు ఆరోస్తున్నారు. ఈ మానసిక ఒత్తులను తట్టుకోలేకనే ఈరోజు ఉదయం నాలుగు గంటల సమయంలో మహదేవప్ప మృతి చెందినట్లు సమాచారం ఇది ఆత్మహత్య ? లేక మరేదేమైనా కారణమా అన్నది పూర్తిస్థాయి పోలీస్ విచారణలో తేలాల్సిన విషయం కొంతకాలం క్రితం బలవంతంగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పించిన కేవలం రెండు రోజుల్లోనే తిరిగి బిజెపిలో చేరి ఆరవ వార్డ్ అభ్యర్థిగా పోటీచేసిన నిబద్ధత కలిగిన కార్యకర్త మహదేవప్ప నిన్న మక్తల్ పట్టణంలో నిర్వహించిన బిజెపి ర్యాలీ ఘన విజయం సాధించడంతో ఓర్వలేక బిజెపి అభ్యర్థులకు ఫోన్ల ద్వారా బెదిరింపులు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ బెదిరింపుల మధ్యనే మహదేవప్ప అనువాదస్పద స్థితిలో మృతి చెందడం ప్రజలలో తీవ్ర ఆందోళనకు దారి తీస్తుంది ఈ ఘటనకు మంత్రి వాకిటి శ్రీహరి కారణమని మహదేవప్ప సతీమణి పోలీసులకు స్టేట్మెంట్ ఇవ్వడం మరింత కలిసి వేసింది ఇలాంటి అహంకార రాజకీయ నాయకులను సభ్య సమాజం ప్రశ్నించాలని, బాధ్యులపై వెంటనే హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేసి నిష్పక్షపాత విచారణ జరపాలి. ఒక రాజకీయ నాయకుడు వేధింపులకు ఒక నిండు ప్రాణం బలయింది ఇది కేవలం ఒక వ్యక్తి మరణం కాదు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి మహదేవప్పకు న్యాయం జరగాల్సిందే అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, బిజెపి జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చందుపట్ల లక్ష్మారెడ్డి, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉడుగుల యాదగిరి, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, జిల్లా ఐటీ కన్వీనర్ ప్రకాష్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు రేపాక రామచంద్రం రెడ్డి, గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేష్, ఎల్లారెడ్డిపేట మండల ప్రధాన కార్యదర్శి నంది నరేష్, దాసరి గణేష్, కృష్ణ హరి, గంభీరావుపేట్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, బీజేవైఎం ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు జితేందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు వంతడుపుల సుధాకర్, జిందం సంతోష్, సిరిసిల్ల వంశీ, బాల గౌడ్, ఆంజనేయులు, డాక్టర్ సత్యనారాయణ, కిరణ్, నాయక్, బాలకృష్ణ, రామ్ రెడ్డి, నెవూరి శ్రీనివాసరెడ్డి, వంగల రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థినిని ప్రేమించి.. రహస్యంగా పెళ్లిచేసుకున్న ఫిజిక్స్ ఉపాధ్యాయుడు..

- పోక్సో కేసు నమోదు

**బలగం టీవీ, మేడ్చల్-మల్కాజ్‌గిరి:**

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువే.. మైనర్ అని కూడా చూడకుండా పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ప్రేమ పేరుతో వంచించి, రహస్యంగా పెళ్లి చేసుకున్న ఉదంతం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో కలకలం రేపింది.

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో పర్రే మైటీన్ (27) అనే వ్యక్తి ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినికి మాయమాటలు చెప్పి, ఆమెను ప్రేమ వలలో పడేశాడు. ఈ క్రమంలోనే ఆ విద్యార్థినిని ఎవరికీ తెలియకుండా రహస్యంగా వివాహం చేసుకున్నాడు. గత 20 రోజుల క్రితం బాలిక మెడలో పసుపు తాడు ఉండటాన్ని గమనించిన తల్లి, అనుమానంతో ఆమెను నిలదీసింది. దీంతో భయపడిపోయిన బాలిక, ఉపాధ్యాయుడు మైటీన్ తనను పెళ్లి చేసుకున్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించింది. వెంటనే బాలిక కుటుంబ సభ్యులు పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించగా, వారి నుంచి నిర్లక్ష్యంగా సమాధానం రావడంతో స్కూల్ యాజమాన్యం వైఖరితో ఆగ్రహం చెందిన తల్లిదండ్రులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడైన ఉపాధ్యాయుడు పర్రే మైటీన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. మైనర్లపై ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ

**బలగం టీవి, హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను సమూలంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో పలు కీలక రైల్వే ప్రాజెక్టులు, కొత్త సర్వీసులు, మౌలిక వసతుల అభివృద్ధిపై ఆయనతో విస్తృతంగా చర్చించారు. ఈ మేరకు సమగ్రమైన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. విజయవాడ--బెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేటాయించాలని సీఎం చంద్రబాబు కోరారు.

# యూఏఈపై న్యూజిలాండ్ ఘన విజయం

**సీఫర్ట్--అలెన్ విధ్వంసం.. 10 వికెట్ల తేడాతో కివీస్ జయభేరి**



**బలగం టీవీ, హైదరాబాద్**

వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌లో భారత జట్టు చేతిలో పరాభవం చవిచూసిన న్యూజిలాండ్, మెగా టోర్నీలో మాత్రం పూర్తి స్థాయిలో జూలు విదుల్చుతోంది. తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ స్పిన్ ఉచ్చును ఛేదించిన బ్లాక్‌క్యాప్స్, ఈసారి యూఏఈపై పూర్తిస్థాయి ఆధిపత్యం ప్రదర్శించాయి. చెన్నైలో జరిగిన ఈ మ్యాచ్‌లో 174 పరుగుల లక్ష్యాన్ని ఓపెనర్లు టిమ్ సీఫర్ట్ (89 నాటౌట్), ఫిన్ అలెన్ (84 నాటౌట్) ఏమాత్రం ఒత్తిడికి లోనుకాక మంచుముక్కలా కరిగించారు. రెండో ఓవర్ నుంచే దూకుడే మంత్రంగా యూఏఈ బౌలర్లపై ఈ జోడీ విరుచుకుపడింది. బౌండరీల వర్షంతో స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. అర్ధశతకాలు పూర్తి చేసిన అనంతరం మరింత రెచ్చిపోయిన సీఫర్ట్, అలెన్ ప్రత్యర్థి బౌలర్లపై ఎలాంటి జాలి, దయ లేకుండా చెలరేగారు. ఫలితంగా 26 బంతులు మిగిలి ఉండగానే న్యూజిలాండ్ లక్ష్యాన్ని ఛేదించి 10 వికెట్లతో ఘన విజయం సాధించింది.

174 పరుగుల ఛేదనలో ఇద్దరూ నువ్వానేనా అన్నట్లు పోటీపడి బౌండరీల పండుగ చేశారు. రోహిద్ ఖాన్ వేసిన 6వ ఓవర్లో సీఫర్ట్ మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 20 పరుగులు రాబట్టాడు. పవర్‌ప్లే ముగిసే సరికి కివీస్ స్కోర్ 80కి చేరువైంది. ఈ జోడీని విడదీయాలని యూఏఈ కెప్టెన్ వసీం బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. స్వీప్ షాట్లు, ఫ్లిక్స్, కట్ షాట్లతో అలరించిన సీఫర్ట్, అలెన్ ఏ దశలోనూ ఔటయ్యేలా కనిపించలేదు. 16వ ఓవర్‌లో రోహిద్ వేసిన రెండో బంతిని సీఫర్ట్ సిక్సర్‌గా మలచడంతో బ్లాక్‌క్యాప్స్ విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ విజయంతో మిచెల్ శాంట్నర్ బృందం గ్రూప్--డీలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది.

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ పటిష్టమైన న్యూజిలాండ్ బౌలర్లకు ధీటుగా నిలిచింది. ఓపెనర్ ముహమ్మద్ వసీం (64 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రాణించగా, అలీషన్ షరాఫు (55) అర్ధశతకంతో జట్టును ఆదుకున్నాడు. ఈ జోడీ దూకుడుతో 15 ఓవర్లకే యూఏఈ స్కోర్ 120 పరుగులు దాటింది. ఆఖర్లో మయాంక్ కుమార్ (21) వేగంగా పరుగులు రాబట్టాడు. చివరి ఓవర్లో మరిన్ని పరుగులు రాబట్టాలనుకున్న యూఏఈకి మ్యాట్ హెన్రీ షాక్ ఇచ్చాడు. వరుసగా రెండు వికెట్లు తీసి స్కోరును కట్టడి చేశాడు. నిర్ణీత 20 ఓవర్లలో యూఏఈ 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు మాత్రమే చేయగలిగింది.

# ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్ బోణీ

- **డీ లీడే ఆల్‌రౌండ్ షోతో బోణీ**

**కొట్టిన డచ్ జట్టు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ టీ20 ప్రపంచకప్--2026లో నెదర్లాండ్స్ జట్టు విజయ ఖాతా తెరిచింది. పాకిస్థాన్‌తో తృటిలో చేజారిన పరాజయం నుంచి త్వరగా కోలుకున్న డచ్ జట్టు, గ్రూప్--ఏలో భాగంగా మంగళవారం ఢిల్లీ వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో బాస్ డీ లీడే (72 నాటౌట్, 2/20) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జాన్ నికోల్ లాఫ్టీ (38 బంతుల్లో 42; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జాన్ ఫ్రైలింక్ (26 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్లుగా నిలిచారు. నమీబియా బ్యాటర్లలో నలుగురు మాత్రమే రెండంకెల స్కోర్ చేయగా, మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. నెదర్లాండ్స్ బౌలర్లలో బాస్ డీ లీడే (2/20), లోగన్ వాన్ బ్రీక్ (2/13) రెండేసి వికెట్లు తీయగా, ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాసెన్ చెరో వికెట్ పడగొట్టారు.



అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన నెదర్లాండ్స్ 18 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసి సునాయాస విజయాన్ని అందుకుంది. బాస్ డీ లీడే 48 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 72 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కొలిన్ అకెర్‌మన్ (32), మైఖేల్ లెవిట్ (28) కీలక ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (18 నాటౌట్) దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. నమీబియా బౌలర్లలో బెర్నాడ్, రుబెన్, జాన్ నికోల్ చెరో వికెట్ తీశారు. ఈ గెలుపుతో నెదర్లాండ్స్ గ్రూప్--ఏలో రెండో స్థానానికి చేరుకుంది. తదుపరి మ్యాచ్‌ల్లో ఆ జట్టు అమెరికా, భారత్‌తో తలపడనుంది.

# లాంగ్ గ్యాప్ తర్వాత రవిబాబు కొత్త చిత్రం 'రేజర్'

- **2026 మేలో ప్రేక్షకుల ముందుకు**

**బలగం టీవీ, హైదరాబాద్**




నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసుకున్న మల్టీ టాలెంటెడ్ సీనియర్ నటుడు రవిబాబు మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అవసరం లేని రవిబాబు, లాంగ్ గ్యాప్ తర్వాత డైరెక్టర్ కమ్ యాక్టర్‌గా తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'రేజర్'.

రవిబాబు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ వీడియోలో రవిబాబు యాక్షన్ అవతార్‌లో కనిపిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచారు. ఫ్లయింగ్ ఫ్రాగ్స్, సురేశ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ పూర్తయినట్లు చిత్ర బృందం ప్రకటించింది. 'రేజర్' చిత్రాన్ని 2026 మే నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాలో రవిబాబు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు. రవిబాబు చివరిసారిగా ఆర్.పీ. పట్నాయక్ దర్శకత్వంలో వచ్చిన 'కాఫీ విత్ ఏ కిల్లర్' సినిమాలో కీలక పాత్రలో నటించారు. దర్శకుడిగా 2021లో 'క్రష్' చిత్రాన్ని తెరకెక్కించారు. 'రేజర్'తో మరోసారి విభిన్న కథాంశంతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నంలో రవిబాబు ఉన్నారు.

# అమెరికాపై పాకిస్థాన్ ఘన విజయం




**బలగం టీవీ, హైదరాబాద్**

టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టు విజయాల పరంపరను కొనసాగిస్తోంది. టోర్నీలో తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై విజయం సాధించిన పాకిస్థాన్, మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో అమెరికాపై 32 పరుగుల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. ఈ గెలుపుతో గ్రూప్--ఏలో పాక్ స్థానం మరింత బలపడింది.

కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అమెరికా ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ 41 బంతుల్లో 73 పరుగులు చేసి మెరుపు అర్ధశతకంతో ఆకట్టుకోగా, కెప్టెన్ బాబర్ ఆజమ్ 32 బంతుల్లో 46 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివరి ఓవర్లలో షాదాబ్ ఖాన్ 12 బంతుల్లో 30 పరుగులు చేసి దూకుడుగా ఆడడంతో పాక్ భారీ స్కోరుకు చేరుకుంది. అమెరికా బౌలర్లలో షాడ్లీ వాన్ షాల్క్‌విక్ 25 పరుగులిచ్చి 4 వికెట్లు తీసి మెరిశాడు.

అనంతరం 191 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికా జట్టు గట్టిగానే పోరాడింది. శుభమ్ రంజానె 30 బంతుల్లో 51 పరుగులు, షయాన్ జహంగీర్ 34 బంతుల్లో 49 పరుగులతో ఆకట్టుకున్నప్పటికీ, కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో లక్ష్యానికి దూరమైంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 158 పరుగులు మాత్రమే చేయగలిగింది. పాకిస్థాన్ బౌలర్లలో ఉస్మాన్ తారిఖ్ 3 వికెట్లు తీయగా, షాదాబ్ ఖాన్ 2 వికెట్లతో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచాడు.

# అనిల్ రావిపూడి కొత్త సినిమాపై ఊహాగానాలకు చెక్

**"పేపర్‌పై పెన్ను కూడా పెట్టలేదు" : అనిల్**

**బలగం టీవీ, హైదరాబాద్**



వరుస విజయాలతో టాలీవుడ్‌లో స్టార్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న అనిల్ రావిపూడి తన తదుపరి చిత్రంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి స్పష్టత ఇచ్చారు. తన కొత్త సినిమా హీరో, కథ, టైటిల్ అంటూ వస్తున్న ఊహాగానాలపై ఆయన ఆసక్తికరంగా స్పందించారు. ఇంకా ప్రాజెక్టుకు సంబంధించి తాను పేపర్‌పై పెన్ను కూడా పెట్టలేదని, అలాంటప్పుడు పూర్తి వివరాలు ఎలా ప్రచారంలోకి వచ్చాయని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ, "నేను పేపర్ మీద కలం కూడా పెట్టలేదు. కానీ ఇప్పటికే నటీనటులు, కథ, టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు ప్రచారం చేస్తున్నారు. ఈ ఫ్లో చూస్తుంటే యాక్షన్, కట్ కూడా చెప్పేస్తారేమో. ప్రేక్షకుల ఉత్సాహాన్ని నేను అర్థం చేసుకోగలను. అయితే నేను చేసే సినిమా ఏంటి, ఎవరితో అనేది అతి త్వరలోనే నిజమైన, పూర్తి వివరాలతో మీ ముందుకు వస్తాను" అని తెలిపారు.


మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఇటీవల సంక్రాంతి కానుకగా విడుదలైన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయం తర్వాత అనిల్ రావిపూడి తదుపరి చిత్రం ఇదేనంటూ పలు ఊహాగానాలు తెరపైకి వచ్చాయి.

గత చిత్రాలన్నీ కమర్షియల్‌గా ఘన విజయం సాధించడంతో అనిల్ రావిపూడి తర్వాతి సినిమాపై ప్రేక్షకుల్లోనే కాకుండా సినీ వర్గాల్లో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పలువురు స్టార్ హీరోల పేర్లు, వివిధ కథాంశాలు ప్రచారంలోకి రావడం గమనార్హం. అయితే ఈ ఊహాగానాలన్నింటికీ దర్శకుడు తాజాగా ఫుల్‌స్టాప్ పెట్టారు.

# విశ్వక్ సేన్--అనుదీప్ కేవీ 'ఫంకీ'కి సెన్సార్ పూర్తి

**బలగం టీవీ, హైదరాబాద్**

మాస్ కా దాస్ విశ్వక్ సేన్, 'జాతిరత్నాలు' ఫేమ్ దర్శకుడు అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో తెరకెక్కిన క్రేజీ ఎంటర్టైనర్ 'ఫంకీ' (ఖీఖచీఖ్) సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. చిత్రానికి సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికేట్ జారీ చేయగా, రన్‌టైమ్‌ను 128 నిమిషాలుగా ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని మేకర్స్ 'అన్‌లిమిటెడ్ అబ్సర్డ్ ఫన్' ప్యాకేజీగా ప్రమోట్ చేస్తున్నారు. ఇండస్ట్రీ నేపథ్యంలో సాగే సెటైరికల్ కామెడీగా రూపొందిన ఈ సినిమాలో విశ్వక్ సేన్ ఒక ఫిల్మ్ డైరెక్టర్ పాత్రలో కనిపించనుండగా, కయాడు లోహర్ కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన 'యమ యమ్మ' పాటతో పాటు ఫన్నీ ట్రైలర్ ప్రేక్షకుల్లో మంచి హైప్‌ను క్రియేట్ చేశాయి.భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ 4 సినిమాస్ సంయుక్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి. వాలెంటైన్స్ వీకెండ్ సందర్భంగా ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తి స్థాయి కామెడీ ఎంటర్టైన్మెంట్‌ను అందిస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.




# 'లాహోర్ 1947' రిలీజ్ డేట్ ఫిక్స్

**2026 ఆగస్టు 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'లాహోర్ 1947'. స్టార్ హీరో ఆమిర్ ఖాన్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సన్నీ డియోల్ కీలక పాత్రలో నటిస్తున్నారు. పవర్‌ఫుల్ ఎమోషనల్ పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో షబానా అజ్మీ, ప్రీతి జింటా, కరణ్ డియోల్, అలీ ఫజల్, అభిమన్యు సింగ్ తదితరులు ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ.ఆర్. రెహమాన్ అందిస్తుండగా, సౌండ్ డిజైనింగ్ బాధ్యతలను రసూల్ పూకుట్టి నిర్వహిస్తున్నారు. ప్రముఖ కవి జావెద్ అఖ్తర్ ఈ చిత్రానికి సాహిత్యాన్ని సమకూర్చారు. తాజాగా చిత్రయూనిట్ ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించింది. భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 2026 ఆగస్టు 13న 'లాహోర్ 1947'ను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

# 'కొచ్చాడయాన్' నిర్మాతకు మద్రాస్ హైకోర్టు షాక్

**చెక్ బౌన్స్ కేసులో రూ.2.52 కోట్లు పరిహారం చెల్లించాలన్న ఆదేశాలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన 'కొచ్చాడయాన్' (తెలుగులో 'విక్రమసింహా') సినిమా నిర్మాత మురళీ మనోహర్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. చెక్ బౌన్స్ కేసులో సంబంధిత అడ్వర్టైజింగ్ అండ్ మీడియా కంపెనీకి రూ.2.52 కోట్లు పరిహారం చెల్లించాల్సిందేనని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నిర్ణీత గడువులోపు ఆ మొత్తం చెల్లించకపోతే జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.2014లో రజనీకాంత్ హీరోగా, ఆయన కుమార్తె సౌందర్య రజనీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కొచ్చాడయాన్' చిత్రాన్ని వన్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై మురళీ మనోహర్ నిర్మించారు.